# రోడ్లు గుంతలమయం.. ఒళ్లు హూనం

- ధూళి కళ్లలో పడిందో.. ఆపై యాక్సిడెంట్లు ఖాయం..
- ప్రమాదాలకు కేంద్రంగా శేషగిరినగర్ బైపాస్ రోడ్డు
- వాహనాల రాకపోకలతో ఊరంతా దుమ్ము, ధూళి
- 100 అడుగుల రోడ్డు నిర్మాణానికి తిలోదకం!
- సింగరేణి నిధులతో 40 అడుగుల రోడ్డుకే పరిమితం!
- ఇక్కడి ప్రమాదాలపై నిరుడే 'నమస్తే' కథనం
- ఎమ్మెల్యే, సీఎండీ స్పందించినా నిలిపిన శక్తులు!


కొత్తగూడెం - ఇల్లెందు బైపాస్ (ఎల్ఐసీ ఆఫీస్) రోడ్డులో ఏర్పడిన గుంతలు, లేస్తున్న దుమ్ము, ధూళి

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 26 : ఆ రోడ్డు గుంతలమయం. దానిపై ప్రయాణిస్తే ఒళ్లు హూనం కావడం ఖాయం. పొరపాటున దుమ్మో ధూళో కంట్లో పడింతో.. యాక్సిడెంట్లు తథ్యం.. ఇదీ నిత్యం ప్రమాదాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం శేషగిరినగర్ బైపాస్ రోడ్డు పరిస్థితి. సాక్షాత్తూ జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణ శివారులోని దుస్థితి. కొత్తగూడెం పట్టణంలోని లక్ష్మీదేవిపల్లి మండలంలో గల శేషగిరినగర్ కాలనీ వాసులకు కొత్తగూడెం - ఇల్లెందు (ఎల్ఐసీ ఆఫీస్) బైపాస్ రోడ్డు నరకప్రాయంగా మారింది. గతంలో ఈ బైపాస్ రోడ్డుని 100 అడుగుల రోడ్డుగా ప్రతిపాదిస్తూ ఆర్అండ్‌బీ అధికారులు మార్కింగ్ చేశారు. కానీ కొందరు పాలకులు కుట్ర ఫలితంగా.. అభివృద్ధికి చేరువైన తమ ఊరిని అలాగే వదిసినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం జరుగకుండా కొందరు కాంట్రాక్టర్లు, స్థానిక అధికార పార్టీ నాయకులు అడ్డుపడుతున్నారని, తాత్కాలిక మరమ్మతులతో నిధులు స్వాహా చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలు, జరగాల్సిన నిర్మాణాల గురించి గత ఏడాది జూలై 29న 'నమస్తే తెలంగాణ' ఓ కథనాన్ని ప్రచురించింది. అందుకు స్పందించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.. నిధుల మంజూరు కోసం సింగరేణికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆ సంస్థ సీఎండీ బలరాం సైతం సానుకూలంగా స్పందించారు. అయితే ఆ తరువాత ఈ రోడ్డును కేవలం 40 అడుగుల రోడ్డుగానే మరమ్మతులు చేయించేందుకు కుట్రలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొత్తగూడెం నడిబొడ్డులోని పోస్టాఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రాపురం మీదుగా ఇల్లెందు వెళ్లే బైపాస్‌గా ఉన్న ఈ మార్గానికి వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం జరిగితే ఆ ప్రాంతం సైతం అభివృద్ధి జరుగుతుంది. పైగా పట్టణంలోని ట్రాఫిక్ సమస్య కూడా సగానికి సగం తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ మార్గం ద్వారా భారీ వాహనాలు (ట్రాన్స్‌పోర్ట్ లారీలు, టిప్పర్లు) ప్రయాణిస్తున్నాయి. దీంతో ఆ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. విపరీతంగా దుమ్ము లేస్తోంది. పైగా శేషగిరినగర్ కాలనీలోని ఇళ్లన్నీ ధూళిమయమవుతున్నాయి. ఈ రోడ్డుకు ఇరువైపులా అంచులు విరిగాయి. దీంతో ఈ రోడ్డు ప్రమాదభరితంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో ఇక్కడి ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా కాలుష్యం వెదజల్లుతోంది. ఎంపీడీవో కార్యాలయం, సీఎస్ఐ, జేవీఆర్ చర్చిలు, మూడు పాఠశాలలు, ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా కోర్టు, సింగరేణి ప్రకాశం మైదానం, డీఎస్పీ కార్యాలయం, సింగరేణి ఎడ్యుకేషన్ జీఎం కార్యాలయం, సింగరేణి సెంట్రల్ వర్క్‌షాప్, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం, గెస్ట్‌హౌజ్, జడ్పీ క్యాంపు కార్యాలయం, ఎల్ఐసీ ఆఫీసు, ఓఎస్డీ కార్యాలయం, జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్, దేవాలయాల వంటివి ఈ మార్గంలోనే ఉన్నాయి. ఎంతోమంది ప్రజలు, వాహనాల రాకపోకలతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా శేషగిరినగర్ కాలనీకి వెళ్లాలంటే ఒళ్లు హూనం చేసుకునేందుకు సిద్ధం కావాల్సిందే అన్నట్లుగా ఉంది పరిస్థితి. దుమ్ము లేవడం, ధూళి కళ్లలో పడడం, మార్గం సరిగా కన్పించకపోవడం వంటి కారణాలతో ఈ మార్గంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పాఠశాలలు, కోర్టు ప్రారంభం, ముగింపు సమయాలకు ఈ మార్గం విద్యార్థులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులతో నిండిపోయి ఉంటుంది. ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతోంది. అప్రమత్తంగా ఉన్నప్పటికీ కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి.




కొత్తగూడెం - ఇల్లెందు బైపాస్ (ఎల్ఐసీ ఆఫీస్) రోడ్డులో ఏర్పడిన గుంతలు

## పోలింగ్ కేంద్రం సందర్శన


అన్నపురెడ్డిపల్లి: పోలింగ్ సామగ్రితో సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 26: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. మండలంలో 20 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు.

పినపాక, ఫిబ్రవరి 26: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ అద్దంకి నరేష్ తెలిపారు. ఆయన బుధవారం పినపాకలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 35 మంది ఓటర్లు ఉన్నాయని చెప్పారు.

## కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 26: కోడి పందేల స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. మండలంలోని కొత్త గంగారం సమీపంలో కోడి పందేల స్థావరంపై ఎస్సై యయాతి రాజు దాడి చేశారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు, ఆరు పందెం కోళ్లు, రూ.1,200 స్వాధీనపర్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 26: మండలంలోని దురదపాడు వాగు నుంచి ఆసుపాక గ్రామానికి బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్సై యయాతిరాజు అడ్డుకున్నారు. వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

## విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం


సాయిరాంతండాలో దగ్ధమైన పూరిల్లు

జూలూరుపాడు, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని సాయిరాంతండాలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం పూరిల్లు దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిరాంతండాకు చెందిన గుగులోత్ వీరు తన భార్యతో కలిసి ఉదయాన్నే పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు వ్యాపించి బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారం, రూ.90 వేల నగదు, ఇంట్లో ఉన్న 70 కిలోల కందులు, వంట సామగ్రి, కూలరు, దుస్తులు, విద్యార్థుల స్టడీ సర్టిఫికెట్లు, భూముల హక్కుపత్రాలు సహా అగ్నికి ఆహుతయ్యాయి. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు పైగా ఉంటుందని బాధితులు వాపోయారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ, వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు, నాయకులు చేపలమడుగు రామ్మూర్తి గుగులోత్ వీరును పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆదివాసీ విద్యార్థులకు వితరణ

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 26 : పాల్వంచ మండలంలోని దంతెలబోర ఎస్సీ కాలనీ పంచాయతీ సీతారాంపురం గ్రామంలోని పేద ఆదివాసీ పిల్లలకు పాల్వంచలోని శక్తి ఫౌండేషన్ వారు బుధవారం పలకా, బలపం, బిస్కెట్‌ప్యాకెట్లు అందించారు. అక్కడే మధ్యాహ్న భోజనం వండి వారికి వడ్డించారు. బాలలకు చదువు నేర్పించాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బాలల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకురాలు ఉమాకుమారి, సభ్యులు ప్రియ, అనిత, పావని, అమృత్, సుష్మ, ప్రసన్న, నర్మద, స్థానికులు నిమ్మల రాంబాబు, నాగప్రసన్నకుమారి, గోపి, నాగరాజు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## పటేల్ స్టేడియంలో కొనసాగుతున్న టెన్నిస్ పోటీలు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 26 : ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న చల్లపల్లి రాధమ్మ పురుషుల ర్యాంకింగ్ జాతీయ టోర్నమెంట్‌లో సంచనాలు నమోదవుతున్నాయి. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో టాప్‌సీడ్ ఉదిత్ కంబోస్ (హర్యానా) ఆశ్చర్యకరమైన రీతిలో అథర్వ శర్మ(మహారాష్ట్ర) చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 7-6(5), 1-6,6-3 తేడాతో ఓటమిని మూట గట్టుకున్నారు. అదేవిధంగా సింగిల్స్‌లో తెలంగాణ ఆశాకిరణం తీర్థ శశాంక్ మాచెర్ల (4) దురదృష్టవశాత్తు కుడి మణికట్టులో ఇన్‌ఫ్లమేటరీ గ్యాంగ్లియన్ కారణంగా గేమ్ మధ్యలోనే నిష్క్రమించారు. పురుషులు సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌లు క్వార్టర్ ఫైనల్ దాటి సెమీస్‌కు చేరుకున్నాయి. పోటీలను జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లపల్లి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కాసినేని, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, చీఫ్ రిఫరీ ప్రవీణ్ నాయక్, కాళ్ల పాపారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేష్, కాళ్ల సూర్య పర్యవేక్షించారు.

## మోడ్రన్ ఇఖ్రా స్కూల్ వార్షికోత్సవం



వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రామవరం, ఫిబ్రవరి 26 : కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం మండల విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం. ప్రభుదయాళ్, సింగరేణి ఏరియా వర్క్‌షాప్ ఇంజినీర్ ఉపేందర్‌బాబు మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులకు సంస్కారం, నైతిక విలువలు కూడా నేర్పించాలన్నారు. చదువును వ్యాపార దృష్టిలో చూడకూడదని, సత్ సమాజం నిర్మాణం కోసం భావిభారత పౌరులను తీర్చిదిద్దే సేవా దృక్పదంతో పనిచేయాలని కోరారు. అమ్మ ఔన్నత్యాన్ని, నాన్న త్యాగాన్ని చాటుతూ చిన్నారులు ప్రదర్శన, వైద్యం నారాయణో హరి అంటూ డాక్టర్ల సేవ, సెల్‌ఫోన్ల వల్ల కుటుంబ సభ్యుల మధ్య దూరం ఎలా పెరుగుతుందో తెలుపుతూ చేసిన నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మొక్కల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి, కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్, అబ్దుల్ సమద్, హెచ్‌ఎం పర్వీన్ సుల్తానా, టీచర్లు పాల్గొన్నారు.

## మాచినేనిపేటతండాలో చోరీ

జూలూరుపాడు, ఫిబ్రవరి 26 : ఇంటి తాళాలు పగలగొట్టి 2 తులాల బంగారం, రూ.50 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన మండల పరిధిలోని మాచినేనిపేటతండాలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బానోత్ బాలు ఇంటికి తాళం వేసి స్నానాల లక్ష్మీపురంలోని శివాలయంలో నిద్ర చేసేందుకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారం, నగదును అపహరించారు. ఉదయాన్నే ఇంటికొచ్చిన బాలు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై రవి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ ఇల్లందు, టేకులపల్లి ప్రాంతాలలో రైస్‌మిల్లులో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. జీతం: రూ.13,000/- నుండి 15,000/-ల వరకు, మరిన్ని వివరాలకు సంప్ర : 76758 96337.
KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## రైల్వే టెండర్‌లో కార్మికులకు అన్యాయం


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఇల్లెందు, ఫిబ్రవరి 26: ఇల్లెందు సింగరేణి సీఎస్‌పీ రైల్వే కొత్త టెండర్‌లో కార్మికులకు అన్యాయం జరుగుతున్నదని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ వారు బుధవారం ఇల్లెందు సివిల్ డీజీఎం రవి కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎండీ రాసుద్దీన్, కొత్తపల్లి రఘు, కె.సారంగపాణి, కొండపల్లి శ్రీను, ఎస్‌కె.యాకుబ్ షావలి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రధానాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 26 : సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ప్రధాన ఆస్పత్రిలో సింగరేణి వైద్యులు, గైనకాలజిస్టు డాక్టర్ మాలతి బుధవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. సింగరేణి ఉద్యోగి భార్య అండాశయంలో పెద్ద సైజులో ఉన్న 9 గడ్డలను శస్త్రచికిత్స చేసి తీసివేశారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రవళి, థియేటర్ సిబ్బంది సహకరించారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 26: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు బుధవారం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# నీరున్నా ఎండిపోతున్న పంటలు!

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పగిలిపోయిన పైపులు
- సాగునీరందక నెర్రెలుబారిన వరి పొలాలు
- పలుమార్లు చెప్పినా పట్టించుకోని అధికారులు


నీళ్లు లేక నోరుతెరుచుకున్న వరి పొలం

చర్ల, ఫిబ్రవరి 26 : పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. రైతుల పొలాలకు సాగునీరు అందించే పైపులైన్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పగిలిపోవడంతో ఏపుగా ఎదుగుతున్న పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. కళ్ల ముందు ఎండిపోతున్న పంటను చూసి గిరిజన రైతులు దిగులు చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి ఎలా తీర్చాలంటూ మదనపడుతున్నారు. చర్ల మండలం వద్దిపేట గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఉయిక నాగార్జున, ఉయిక రాము, పూనెం నగేష్‌లకు చెందిన 70 ఎకరాల వరి పొలాలు నీరుండి కూడా ఎండిపోతున్నాయి. పూసుగుప్ప వరకు మిషన్ భగీరథ పథకం ద్వారా ఆదివాసీలకు తాగునీరు అందించేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పైపులైను పనులు ప్రారంభించింది. ఈ క్రమంలో వద్దిపేట నుంచి పూసుగుప్ప వరకు జరిగిన తవ్వకాల పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వం తాలిపేరు నదిపై ఏర్పాటు చేసిన లిఫ్టు-2 పైపులు వద్దిపేట వద్ద పగిలిపోయాయి. రైతుల భూములకు నీరందక భూములు నెర్రెలుబారి పొలాలు ఎండిపోతున్నాయి.


బీటలు బారిన వరి పొలం


నెర్రెలు బారిన వరి పొలం

### అధికారులకు ఎన్నోసార్లు చెప్పాం..



లిఫ్టు పైపులు పగిలిపోవడంతో పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. దీని గురించి అధికారులకు ఎన్నోసార్లు చెప్పాం. ప్రతి ఏడాది లిఫ్టు కింద 70 ఎకరాలు పండిస్తున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులు చేయించి పంటలు ఎండపోకుండా చర్యలు తీసుకుంది. ఇప్పుడు అధికారంలో కాంగ్రెస్ నాయకులకు మా బాధలు చెప్పుకున్నా పట్టించుకోడం లేదు. కళ్ల ముందే పంట ఎండిపోతుంటే బాధగా ఉంది.

–ఉయిక నాగార్జున, రైతు, వద్దిపేట

### శాశ్వత పరిష్కారం చూపండి..



తాలిపేరు నదిపై ఐటీడీఏ ఆధ్వర్యంలో గతంలో లిఫ్టు-2 ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పైపుల పగిలిపోవడంతో నీటికి ఇబ్బందిగా ఉన్నదని అధికారులకు చెప్పినా ఇప్పటివరకు పట్టించుకోలేదు. వేసిన వరి పంట ఎండిపోతున్నది. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు పెట్టినం. పంట భూమి పగిలి బీటలు వారింది. అధికారులు తూతూ మంత్రంగా పనులు చేయకుండా శాశ్వత పరిష్కారం చూపి ఆదుకోవాలి.

–ఉయిక రాము, రైతు, వద్దిపేట

# ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

- మార్మోగిన శివ నామస్మరణ
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 26 (నమస్తేతెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా బుధవారం మహా శివరాత్రి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. జిల్లాలోని ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అదేవిధంగా సమీప ఆలయాలకు భారీగా చేరుకుని శివుడికి అభిషేకాలు చేశారు. నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల తాడికితో శివాలయాలు కిక్కిరిసిపోయాయి. ఎటుచూసినా శివ నామస్మరణ మార్మోగింది. రోజంతా ఉపవాస దీక్ష చేపట్టారు. రాత్రంతా జాగారం చేసి భగవంతుని సన్నిధిలో గడిపారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయంలో ఎస్పీ రోహిత్‌రాజు దంపతులు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. అశ్వారావుపేట మండలం మామిళ్లవారిగూడెం గ్రామంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పూజలు చేశారు. దమ్మపేట మండలం వడ్లగూడెం ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పూజలు నిర్వహించారు. భద్రాచలంలోని జయదుర్గ సహిత పంచముఖ విశ్వేశ్వరస్వామిని ఐటీడీఏ పీవో రాహుల్ దంపతులు దర్శించుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల ఆలయ ప్రాంగణంలో ఉన్న గంగాగౌరి సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఇల్లెందులోని శివాలయంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దిండిగాల రాజేందర్ పూజలు చేశారు. బూర్గంపహాడ్ మండలంలోని మోతే శ్రీభద్రకాళి సమేత వీరభద్రుడి ఆలయం గోదావరి నదీతీరం జనంతో నిండిపోయింది. వీరభద్రస్వామికి ఇరవెండికి చెందిన తాళ్లూరి జయశేఖర్, నీలిమ దంపతులు రూ.20 లక్షల విలువైన బంగారు కిరీటాలను బహూకరించారు. మణుగూరులోని పలు శివాలయాలను మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు దర్శించి పూజలు చేశారు. పినపాక మండలం సీతంపేట శ్రీ రాజరాజేశ్వరి, చింతలబయ్యారంలోని పవిత్ర గోదావరి నదీతీరాన ఉమానీలకంఠేశ్వరస్వామి, దుగినేపల్లిలోని శివాలయాలు కిటకిటలాడాయి. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పూజలు చేశారు.